www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 22 డిసెంబర్ 2025 5 ఏలూరు

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను ఈ నెల 22వ తేదీ సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in అందించిందని పేర్కొన్నారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు.

దాళ్వా సాగుపై ఆశలు..!

- ఖరీఫ్‌లో మొంథా తుపానుతో తీరని నష్టం
- రెండు జిల్లాల్లో 32 వేల ఎకరాల్లో పంట నష్టం
- మిగిలిన పంట దిగుబడి రాక పెట్టుబడులు రాని పరిస్థితి
- రెండు జిల్లాల్లో దాదాపు మూడున్నర లక్షల ఎకరాల్లో దాళ్వాసాగు
- కౌలురైతులకు ప్రభుత్వ అండ కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా రైతాంగం దాళ్వా సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఖరీఫ్ సాగులో నష్టాల నుంచి బయటపడాలంటే దాళ్వాలో వచ్చే దిగుబడే ప్రధానమంటూ రైతులు చెబుతున్న పరిస్థితి. దీంతో దాళ్వా సాగుపై ఉత్కంఠ కొనసాగుతోంది. దాళ్వాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. ఇప్పటికే నారుమడులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వారం, పది రోజుల్లో పలు ప్రాంతాల్లో దాళ్వా నాట్లు ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. దాళ్వాసాగులో దిగుబడులు ఆశాజనకంగా వస్తేనే రైతులకు ఊరట లభిస్తుంది. లేకపోతే అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఖరీఫ్‌లో రెండు జిల్లాల వ్యాప్తంగా 4.25 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. అంతా సక్రమంగా సాగుతోందని రైతులు ఎంతగానో సంతోషించారు. పంట చివరి దశకు చేరే సమయంలో నవంబర్‌లో విరుచుకుపడిన మొంథా తుపాను రైతుల ఆశలను చిదిమేసింది.

పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో దాదాపు 32 వేల ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. 33 శాతంపైగా దెబ్బతిన్న పంటను మాత్రమే అధికారులు పంట నష్టం కింద లెక్కించారు. ఈనిక, పొట్ట దశలో తుపాను విరుచుకుపడడంతో తాలు ఎక్కువగా రావడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. కొన్నిచోట్ల ఎకరాకు 30 నుంచి 32 బస్తాల దిగుబడి రాగా, పలుప్రాంతాల్లో 20 నుంచి 25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. రైతులు ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు. రెండు జిల్లాల్లో 80 శాతం కౌలురైతులే సాగు చేస్తున్నారు. దీంతో కౌలుపోను రైతులకు పది నుంచి 15 బస్తాలు మిగలడమే గగనంగా మారింది. రైతుల చేతికి రూ.25 వేలలోపే ఆదాయం వచ్చింది. దీంతో రైతులు ఎకరాకు రూ.15 వేల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. ఎరువుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగిపోవడంతో వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు చేపల చెరువుల తవ్వకంతో ఉన్న పొలాలకు కౌలుసైతం భారీగా పెరిగిపోయింది. కొన్ని ప్రాంతాల్లో పంటకు ఎకరాకు 17 నుంచి 20 బస్తాలు తీసుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఒకపక్క దిగుబడులు తగ్గిపోవడం, మరోపక్క పెట్టుబడి, కౌలు పెరిగిపోవడంతో కౌలు రైతులకు అప్పులే శరణ్యంగా మారాయి. ఖరీఫ్‌లో ఐదెకరాలు సాగు చేసిన రైతు దాదాపు రూ.లక్ష వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దాళ్వా పంట వచ్చేసరికి అప్పులకు వడ్డీ తడిసి మోపుడుకానుంది. దీంతో కౌలు రైతులంతా దాళ్వా సాగుపైనే గంపెడాశలు పెట్టుకున్నారు. దాళ్వాలో ఎకరాకు 50 బస్తాలకు పైగా దిగుబడి వస్తేనే రైతులు బయటపడే పరిస్థితి ఉంటుంది. దీంతో దాళ్వాసాగు త్వరితగతిన పూర్తిచేసేందుకు రైతులు వేగంగా ముందుకు సాగుతున్నారు. సంక్రాంతికి ముందే నాట్లు నాటితే దిగుబడి బాగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

కౌలు రైతులకు ప్రభుత్వం అండ కరువు

ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల బతుకుల్లో మాత్రం మార్పురావడం లేదు. ఎన్నికల్లో కౌలు రైతులకు న్యాయం చేస్తామంటూ హామీలు గుప్పించడం, గెలిచిన తర్వాత పట్టించుకోకపోవడం పాలకులకు పరిపాటిగా మారింది. కౌలుకార్డులు జారీ నుంచి, పంట రుణాల వరకూ అన్నింటా కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. పంటనష్టం, బీమా పరిహారం వంటివి సైతం సాగు చేసిన కౌలు రైతులకు అందించడం లేదు. పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రూ.20 వేల సాయం కూడా కౌలు రైతులకు ఇవ్వడం లేదు. దీంతో వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కొనసాగుతున్నాయి. సాగు చేసే రైతులకు ప్రభుత్వం సాయం అందించే విధంగా మార్పులు వస్తే తప్ప కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగుచేసే రైతుకు అండగా ఉండాలని అంతా కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసేందుకు రైతులు కరువయ్యే పరిస్థితి రానుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

చిన్నారులు పోలియో బారిన పడకుండా వాక్సిన్ వేయించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా స్థానిక జెవిఆర్ నగర్‌లోని ఫిరంగులదిబ్బలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు కలెక్టర్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కానప్పటికీ పక్క రాష్ట్రాల్లో పోలియో కేసులు నమోదు కావడంతో మన రాష్ట్రంలో కూడా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకూ ఏలూరు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 5 సంవత్సరాల్లోపు వయసు కలిగిన ప్రతి చిన్నారికీ పోలియో వాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 5 సంవత్సరాల్లోపు 2 లక్షల 4 మంది చిన్నారులు ఉన్నారని, వీరిలో గ్రామీణ ప్రాంతంలో లక్షా 49 వేల 470 మంది, పట్టణ ప్రాంతాల్లో 29 వేల 827 మంది, గిరిజన ప్రాంతాల్లో 20 వేల 707 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ వాక్సిన్ అందించేందుకు 1707 వ్యాక్సినేషన్ కేంద్రాలు, 72 మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రయాణంలో ఉన్న వారి సౌకర్యార్థం బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్లలో కూడా పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 21వ తేదీన పల్స్ పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, 22, 23వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, పోలియో బారిన పడకుండా కాపాడుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. డిఎంహెచ్ఒ అమృతం, డెమో శ్రీనివాసరావు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రగతి, వైద్య సిబ్బంది మేకా శ్రీనివాసరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం

విద్యార్థునుల ప్రదర్శనలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన బాలోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. బాలోత్సవం కార్యక్రమంలో మూడు కేటగిరీల్లో 38 అంశాల్లో ప్రతిభా ప్రదర్శనలు నిర్వహించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రాఘవరావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బిఎల్‌బి కోటేశ్వరి మాట్లాడుతూ ఈ ఏడాది తొలినాళ్లలో నిర్వహించిన మొట్టమొదటి బాలోత్సవాన్ని అన్ని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో విజయవంతం చేసినట్లు తెలిపారు. నూజివీడు బాలోత్సవం 2 కార్యక్రమాన్ని మరింత రెట్టించిన ఉత్సాహంతో అత్యంత ఘనవిజయం సాధించేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలకు బహుమతులు ఎప్పటికీ కొలమానం కాలేవన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ అద్భుతమైన ప్రతిభను చాటినట్లు వివరించారు. సాంకేతిక పరంగా విజేతలను ప్రకటించినట్లు తెలిపారు. మిగిలిన వారు కూడా విజేతలతో పోటాపోటీగానే ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న బాలోత్సవాలను మరింత గొప్పగా జయప్రదం చేయాలని కోరారు. బాలోత్సవాల నిర్వహణలో ఉదార భావంతో సహాయ సహకారాలు అందించిన విద్యావేత్తలు, రంగాలకు చెందిన ప్రముఖులు, పలు సంఘాలకు చెందిన సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్తగా తీసుకొచ్చిన విబి జీ రాం జీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశ వివరాలను పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పత్రికలకు విడుదల చేశారు. ఏలూరులో సిపిఎం జిల్లా కార్యాలయం (ఉద్దరాజు రామం భవనం)లో జరిగిన పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశంలో బలరాం మాట్లాడుతూ గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్తగా విబి జీ రాం జీ పథకాన్ని తీసుకొచ్చారని, దీనిలో వ్యవసాయ కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవని, ఉన్నవి కూడా పాక్షికంగానే ఉన్నాయని తెలిపారు. గతంలో పని గ్యారంటీ ఉండేదని, కనీసం వంద రోజుల పని పేరుతో 50 రోజులన్నా వ్యవసాయ కార్మికులకు, పేదలకు ఉపాధి లభించేదని, ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని, అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని తెలిపారు. పథకంలో నిధులు గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేవని, ప్రస్తుతం 60, 40 శాతంగా మార్చారని తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మరలా ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పైగా దీనికి నిధుల కేటాయింపు డిమాండును బట్టి కాకుండా రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని, ఇప్పుడు పనిచేసిన తరువాత ఇచ్చేలా పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఉపాధి కల్పనలో ఆలస్యమైతే గతంలో కేంద్రమే నిరుద్యోగ భృతి చెల్లించేదని, ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేసిందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడడం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసిపి కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని తెలిపారు. రెండు పార్టీలూ మోడీని చూసి భయపడుతున్నాయని విమర్శించారు. అలాగే భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసిని ప్రయివేటుపరం చేస్తూ తీసుకొచ్చిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో అణు, రక్షణ రంగాలను ప్రయివేటుపరం చేస్తూ చేసిన బిల్లును సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేస్తూ పేదల ఉసురు తీస్తున్న పాలకులు ఏమీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాబోయే కాలంలో ఈ సమస్యలపై సిపిఎం పెద్దఎత్తున పోరాటాలకు సన్నద్ధమవుతుందని, ఆ పోరాటాలకు ప్రజలందరూ కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో డిఎన్‌విడి ప్రసాద్, కె.శ్రీనివాస్, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, ఆర్.లింగరాజు, కె.రాజు పాల్గొన్నారు.

నేటి ఏజెన్సీ బంద్‌కు సర్వం సన్నద్ధం

సిపిఎం సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - డెస్క్

ఈ నెల 22వ తేదీ సోమవారం జరిగే ఏజెన్సీ బంద్‌కు సర్వం సన్నద్ధమైంది. ఏజెన్సీ జిల్లా సాధన కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించనున్నారు. ఈ బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం, దేవిపట్నం, పోలవరం నియోజకవర్గంలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు ప్రజలు నిర్వాసితులవుతారు. వీరికి ఏలూరు జిల్లాలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో పునరావాసం కల్పిస్తున్నారు. అలాగే రంపచోడవరం నియోజకవర్గం మండలాల్లో చాలా మందికి సైతం పోలవరం ప్రాంతంలోనే పునరావాసం కల్పిస్తున్నారు. ఇప్పటికే కల్పించిన వారికి పలు సమస్యలున్నాయి. భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదురౌతాయి. ఇవన్నీ పరిష్కరించడానికి ఈ ప్రాంతమంతా ఒకే కార్యనిర్వాహక యూనిట్‌గా ఉండటం అవసరం. ఇందువల్ల నిర్వాసితులకు పునరావాసంతో పాటు ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడానికి తోడ్పడుతుంది. ఏజెన్సీ ప్రాంత (షెడ్యూల్) చట్టాల అమలుకు, ఆదివాసీలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుంది. రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలు రెండూ ఎస్‌టి నియోజకవర్గాలే. పోలవరం ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసీ ప్రాంతాన్ని చేర్చేలా చర్యలు తీసుకోవాలని, కోరుతూ తలపెట్టిన ఈ బంద్ విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా మండలాల్లో బైక్ ర్యాలీలు, సచివాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

సున్నంపూడిలో విషాదం

- బొలెరో వాహనం బోల్తా పడడంతో ఇద్దరు మత్స్యకారులు మృతి
- నలుగురికి గాయాలు, వారిలో ఒకరి పరిస్థితి విషమం

ఆంజనేయులు (ఫైల్)

వెంకటేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి - కలిదిండి

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వారివి. అందరూ మత్స్యకార కుటుంబీకులే. బొలెరో వాహనంలో చేపల పట్టుబడికి వెళ్లి బొలెరో వాహనం బోల్తా పడడంతో ఇద్దరు మృతి చెందాడు. నలుగురు గాయాలపాలయ్యారు. ఇంటర్ చదువుతున్న ఇద్దరు యువకులు ఆదివారం కావడంతో పనికి వెళ్లి ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. ఆ యువకుల తండ్రులు మృతి చెందడంతో సున్నంపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాదకార ఘటన మండలంలోని గుర్వాయిపాలెం పంచాయతీ పరిధి మద్దవానిగూడెం ఉప్పుటేరు వంతెన సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తాడినాడ పంచాయతీ సున్నంపూడికి చెందిన ఆరుగురు ఆదివారం ఉదయం బొలెరో వాహనంలో చేపల పట్టుబడి కోసం చైతన్యపురం వెళ్లారు. పట్టుబడి అనంతరం తిరిగి సున్నంపూడికి



బోల్తా పడిన బొలెరో

బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని గుర్వాయిపాలెం పంచాయతీ పరిధి మద్దవానిగూడెం ఉప్పుటేరు వంతెన సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బొలెరో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తిరుమలశెట్టి ఆంజనేయులు (48), కొల్లి వెంకటేశ్వరరావు (49) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. గాయాలపాలైనవారిలో ఆంజనేయులు కుమారుడు వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు కుమారుడు ఉన్నారు. వెంకటకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని స్థానికులు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆంజనేయులు, వెంకటేశ్వరరావు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

సెలవు కావడంతో పనికి వెళ్లి...

మృతులు ఆంజనేయులు, వెంకటేశ్వరరావు కుమారులు ఇంటర్ చదువుతున్నారు. ఆదివారం కావడంతో తండ్రితో పాటు చేపల పట్టుబడికి వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. మృతుడు కొల్లి వెంకటేశ్వరరావు స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కొత్తపుసల. సున్నంపూడిలో అద్దెకు ఉంటున్నారు. మృతుడు ఆంజనేయులుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

క్షతగాత్రులను అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పరామర్శించారు.

ట్రిపుల్ ఐటిలో ఎఐపై సెమినార్

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తి వేదాంత వారి సహకారంతో ఎఐపై సెమినార్ నిర్వహించారు. ఐఐటి గౌహతి డైరెక్టర్ ప్రొఫెసర్ ఉప్పులూరి రామ్‌గోపాల్, ఐఐటి తిరుపతి నుంచి జయనారాయణ పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆర్‌జియుకెటి విద్యార్థులకు లిటరరీ క్లబ్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, కళాశాల సంచాలకులు కొనియాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వ్యాస రచన పోటీల్లో మొదటి బహుమతి పొందిన అఖిలేశ్వరికి రూ.ఐదు వేలు, రెండో బహుమతి పొందిన షేక్ హసియాకు రూ.మూడు వేలు, మూడో బహుమతి పొందిన హర్షవర్ధన్‌కు రూ.రెండు వేలు నగదును ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్, భక్తి వేదాంత సంచాలకులు డాక్టర్ రామ్ గోపాల్ చేతుల మీదుగా బహుకరించారు. ఇందులో భాగంగానే ఎఐ వినియోగత, ఉపయోగం వంటి విశేష అంశాలపై చర్చించారు. విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు భక్తి వేదాంత వారు లిటరరీ క్లబ్ సహకారంతో నిర్వహించారు. ఈ సెమినార్ విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని అక్కడ విచ్చేసిన ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్ సంచాలకులు డాక్టర్ సంద్ర అమరేంద్రకుమార్, సిఎస్ఇ అధ్యాపకులు కె.సింగ్, డిఎస్‌డబ్ల్యూ (బాలురు) డాక్టర్ లంకపల్లి రాజేష్, డిఎస్‌డబ్ల్యూ (బాలికలు) డాక్టర్ దుర్గాభవాని, అసోసియేట్ డీన్ అకాడమిక్స్ డాక్టర్ దుర్గాబాబు, పిఆర్ఒ డాక్టర్ జడ సుబ్బారావు, లిటరరీ క్లబ్ నిర్వాహకులు, ఆంగ్ల అధ్యాపకులు ఎం.కాత్యాయిని, భక్తి వేదాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ ట్రాఫిక్ పార్క్‌లో ట్రాంపోలిన్ జంప్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్వయంగా పూనుకుని ఏలూరు నగరపాలక సంస్థ సౌజన్యంతో కొంతకాలం క్రితం క్రాస్ రోడ్స్ పేరుతో చిల్డ్రన్ ట్రాఫిక్ పార్క్ ఏర్పాటు చేశారు. ఈ ట్రాఫిక్ పార్క్‌లో చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా పలు రకాలైన ఆట బొమ్మలతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ సైక్లింగ్ ట్రాక్ డ్రైవింగ్ ట్రాక్ పుస్తక పఠనం వంటి అనేకమైన సౌలభ్యాలు వారికి అందుబాటులో ఉండే విధంగా దీన్ని తయారు చేశారు. దీనిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ఏలూరు ట్రాఫిక్ లక్ష్మణరావు ఈ ట్రాఫిక్ పార్క్‌లో ట్రాంపోలిన్ జంప్‌ను చిన్నారుల కోసం ఏర్పాటు చేశారు. అయితే ఈ యూనిట్లను ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఉన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు ఆటపాటలను ఒకే ప్రదేశంలో నేర్పించే విధంగా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఈ ట్రాఫిక్ పార్కును క్రాస్ రోడ్స్ పేరుతో ఏర్పాటు చేశారన్నారు. ఇందులో చిన్నారులకు ఆటలు ఆడేందుకు అనేక రకాలైన ఆట వస్తువులతో పాటు నేటి నుంచి ఈ ట్రాంపోలిన్ జంప్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్‌మీట్

విజేతగా నిలిచిన జట్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో పోలీసు విభాగాల మధ్య ఆటలు పోటీలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగానే ఎన్నాళ్లగానో సివిల్ పోలీసులకు ఎఆర్ పోలీసులకు మధ్య జరిగిన క్రికెట్ ఆటలో ఎఆర్ పోలీసులే గెలుస్తూ వస్తున్నారు. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ఎఆర్ పోలీసు క్రికెట్ టీంపై లా అండ్ ఆర్డర్ పోలీస్ క్రికెట్ టీమ్ ఘన విజయం సాధించింది. దీంతో ఏలూరు సబ్ డివిజన్ క్రికెట్ టీమ్ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా పోలీసు స్పోర్ట్స్‌మీట్-2025 పేరుతో శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఎస్‌పి ప్రతాప్‌శికిషోర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెండో రోజు క్రికెట్ ఆటల పోటీలు ఫైనల్‌కు చేరుకున్నాయి. టెక్నికల్ టీమ్ (ఎఆర్ టీమ్) ఏలూరు సబ్ డివిజన్ పోలీస్ క్రికెట్ టీమ్ జట్ల మధ్య ఆదివారం ఫైనల్ క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఏలూరు సబ్ డివిజన్ పోలీస్ క్రికెట్ టీమ్‌కు కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట్‌కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించారు. టెక్నికల్ టీమ్‌కు డిసిఆర్‌బి సిఐ హబీబ్‌భాషా కెప్టెన్‌గా వ్యవహరించారు. ఏలూరు సబ్ డివిజన్ టీమ్ 120/5 స్కోర్ చేయగా, టెక్నికల్ టీమ్ 93/8 స్కోర్ చేశారు. దీంతో ఏలూరు సబ్ డివిజన్ టీమ్ ఘనవిజయం సాధించింది. గడిచిన ఐదేళ్లలో ఎఆర్ క్రికెట్ టీమ్‌తో సబ్ డివిజన్ టీములు ఎన్నోసార్లు తలపడ్డాయి. అయినప్పటికీ ఎఆర్ టీమ్ విజయాన్ని కైవసం చేసుకునేది, కాని మొదటిసారి ఏలూరు సబ్ డివిజన్ టీమ్ వీరిని ఓడించింది. దీంతో ఏలూరు సబ్ డివిజన్ టీమ్ సంబరాల్లో మునిగితేలుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టెట్- 2025 పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 11 మందికి పది మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, నేటితో టెట్ పరీక్షలు ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

మంచినీటి చెరువులను నింపుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ప్రధాన పంట కాల్వలైన పోలరాజ్ కెనాల్, సిబి కెనాల్ పంట కాలువలకు పూర్తిస్థాయిలో తాగునీటిని విడుదల చేసినందున ఈ రెండు కాల్వల పరిధిలోని గ్రామాల్లో ఉన్న మంచినీటి చెరువులను వెంటనే నింపుకోవాలని పోల్ రాజ్, సిబి కెనాల్ ఎఇలు కెవి.సత్యనారాయణ, బి.సిద్ధార్థ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పంట కాల్వలు ద్వారా బ్రాంచ్ కాలువలకు కొన్నిరోజులు మాత్రమే మంచినీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో త్వరితగతిన మంచినీటి చెరువులను నింపుకోవాలని తెలిపారు. కాలువలను కట్టి వేసే అవకాశం ఉన్నందున వెంటనే స్పందించి మంచి నీటి చెరువులను నింపుకోవాలని పేర్కొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి

గండిగూడెం వాసుల డిమాండ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామపంచాయతీలో ఉన్న పాకనాటిగూడెం, మానికలగూడంతో కలిపి గండిగూడెం కేంద్రంగా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గండిగూడెం గ్రామ పెద్దలు కొరివి శేషారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ జిఒ ఎంఎస్ నెంబర్ 97 పిఆర్అండ్ రూరల్ డెవలప్‌మెంట్ పునర్వ్యవస్థీకరణపై ఉన్న నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసిందని తెలిపారు. ప్రత్యేక పంచాయతీ కోరుతూ ఇప్పటికే పిజిఆర్ఎస్ ద్వారా కలెక్టర్‌కు, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు, ఎంపిడిఒ జి.మణికుమారికి గ్రామస్తుల సంతకాల సేకరణతో కూడిన దరఖాస్తులు అందించామని చెప్పారు. గండిగూడెం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడితే గాంధీజీ చెప్పినట్లు పంచాయతీలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పింగుల మధు, పొదిల రామారావు, కొరివి నాగేశ్వరరావు, పాకనాటి సోమేశ్వరరావు, గంగరాజు, శ్రీరాములు, పాకనాటి దుర్గారావు భూక్య బేగనాథం, భుక్య వేణుగోపాల్‌రావు, భుక్య పోతురాజు, జరుపుల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మానవత ఉంగుటూరు మండల కమిటీ సమావేశం ఆదివారం నారాయణపురంలో నిర్వహించారు. మానవత మండల కన్వీనర్ అడపా శ్రీనివాసరావు ఇంటి వద్ద నిర్వహించిన ఈ సమావేశంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న చేబ్రోలు గ్రామానికి చెందిన ధనరాజ్ అనే వ్యక్తికి మానవత, నారాయణపురం వర్తక సంఘం కలిసి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి నారాయణపురం వర్తక సంఘం అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు, మానవత రీజియన్ ఛైర్మన్ పుష్పాల గోపీ, మానవత మండలాధ్యక్షులు కోనే సత్యనారాయణ, డైరెక్టర్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, కోశాధికారి గంజి రవి, పూర్వ అధ్యక్షులు పుసులూరి ప్రకాష్, బొమ్మిడి అప్పారావు, గుదుమెల్లి రాజారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, గుండుమోగుల తాతారావు, పాండ్రంకుల శ్రీనివాసరావు, బందారు నాగరాజు, బాలకృష్ణ, దాబా రాము, పడాల తాతాజీ సోలాపూరి మూర్తి, మానవత సభ్యులు హాజరయ్యారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ముసునూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు తుక్కులూరులోని వృద్ధాశ్రమంలో ప్రతి నెలా మూడో ఆదివారం భోజనం అందించారు. ఇందులో భాగంగా ఆదివారం వరుసగా ఏడో నెల భోజనం అందించారు. ఈ కార్యక్రమానికి అప్పటి హెచ్ఎం దివెన్నమ్మ రూ.వెయ్యి నగదు అందించారు. పోతుసూరి బాబూరావు, వన్నెకూటి బాబు, చెన్నూరి నాగరాజు, కోనేరు నిరంజనకు నగదు అందించారు.

ఘనంగా దుర్గారామ్‌ప్రసాద్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షులు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఆలపాటి దుర్గారామ్‌ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతలపూడి ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా హాజరై ఆలపాటి దుర్గారాం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, నాయకులు, గ్రామస్తుల కోసం భారీ విందు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టిడిపి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్షులుగా కొండ్రెడ్డి కిషోర్, ప్రధాన కార్యదర్శిగా కోనేటి చంటి, ఉపాధ్యక్షులుగా గడిగోయిల రాధాకృష్ణ, పొదిలి ఫణి, తానిగడప సుమలత, సహాయ కార్యదర్శి దుర్గేష్, కార్యనిర్వహణ కార్యదర్శి వెంపల రాజు, ట్రెజరరీగా శివ, మెయిన్ కమిటీ వారు, 29 వార్డుల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్, కో యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, కో బూత్ ఇన్‌ఛార్జులు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేయాలని నూజివీడు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి, టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని డాక్టర్ ఎన్‌టిఆర్ భవన్‌లో పాత్రికేయులతో ఆదివారం రాత్రి మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ జగన్ కోటి సంతకాల పేరిట చేసిన హడావిడి అంతా ఇంతా కాదన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభించిన మాజీ సిఎం జగన్ ప్రారంభంలోనే వదిలివేశారన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని కలలు కంటున్న జగన్ అధికారులను బహిరంగంగా బెదిరించిన తీరు హేయమైన చర్య అన్నారు. తాము అధికారంలోకి రాగానే రెండు నెలలు పిపిపి విధానాన్ని రద్దుచేసి, అందుకు కారకులైన అధికారులు, ప్రయివేట్ వ్యక్తులను జైలుకు పంపుతామని జగన్ ప్రకటించడం దారుణమన్నారు.

రైతు పక్షపాతి మంత్రి పార్థసారథి

ఇటీవల రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో అన్యాయం జరుగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వద్ద మొరపెట్టుకున్నట్లు టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు తెలిపారు. రైతు పక్షపాతిగా ఉన్న మంత్రి పార్థసారథి గ్రామీణ వరవడితో ఒక మాట దొర్లి ఉండవచ్చని, అంతమాత్రాన ఎవరినో బూతులు తిట్టడం కాదని, ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అనవసరపు వీడియోలను పోస్ట్ చేసి అప్రతిష్ట తీసుకురావద్దన్నారు.

23న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలం పెదవేగి సెక్షన్ 33/11 కెవి కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డిఎస్ఎస్ పథకం పనుల నిమిత్తం ఈ నెల 23వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ఆదివారం ఒక ప్రకటనలు తెలిపారు. కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి గోవిందవారిగూడెం ఫీడర్, 11 కెవి కూచింపూడి హెడ్ క్వార్టర్ ఫీడరు నుంచి వెళ్లే కరెంటుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ (బోరు బావుల) కరెంటు రెండు విడతలుగా తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం పది గంటల వరకు, మళ్లీ తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని సహాయ మాత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆదివారం సెమీ క్రిస్మస్, స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదినేపల్లి విచారణ గురువు కె.మరియదాస్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ప్రతిఒక్కరూ దయ, శాంతి క్షమాగుణాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిస్టర్ అనేస్, స్కూల్ పూర్వ విద్యార్థి పి.సంధ్య, పేరెంట్స్ రీప్రజెంట్ సయ్యద్ జిలాని పాల్గొన్నారు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోలియో రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదాం

పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎన్ఆర్.పేటలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో వంటి ప్రాణాంతక వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు.

స్థానిక 38వ డివిజన్ సుబ్బమ్మ దేవి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పోలియో బూత్‌ను ఏర్పాటు చేశారు. ఫ్యామిలీ ప్లానింగ్ వైద్యులు ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో, సిబ్బంది పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సమాధానరాజు, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అచ్యుతారావు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కమిటీ సభ్యుడు అజయ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మానవత సభ్యులు కూడా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఫైర్ క్రాస్ రోడ్స్ సిగ్నల్ ట్రాఫిక్ పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పూళ్ల, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ప్రదీప్, జాహ్నవి, శరణ్య ఆధ్వర్యంలో ఆరోగ్య విస్తరణాధికారులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. పూళ్లలో గ్రామ సర్పంచి, ఉప సర్పంచి దాయం సుజాత ప్రసాద్, పి.బ్రహ్మనాయుడు, గుండుగొలనులో సొసైటీ అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాజామణి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3,169 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకునే అవకాశం లేని పిల్లలు సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహించే డోర్ టు డోర్ సర్వే కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. అనారోగ్యంతో ఇబ్బంది పడే పిల్లలు పోలియోచుక్కలు వేయించుకోవద్దని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూచించింది.

ఏలూరులో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామంలో ఆదివారం పోలియో నిర్మూలన లక్ష్యంగా పోలియో డ్రాప్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి గంజిమాల రామారావు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో డ్రాప్స్ వేయించి వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బయ్యన్నగూడెం, రాజవరం, కొయ్యలగూడెం, ఎర్రంపేట, పొంగుటూరు, గవరవరం, కన్నాపురం గ్రామాల్లో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో పోలియో డ్రాప్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలకు చుక్కలు వేయిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలియో నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు.

ముసునూరు : అంగవైకల్యం వంటివి రాకుండా మీ పిల్లలను కాపాడడానికి ప్రభుత్వం వారు పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టారని టిడిపి వేల్పుచర్ల యూనిట్ ఇన్‌ఛార్జి గరికపాటి నాని, కాట్రేనిపాడు సర్పంచి గడ్డం సుహాసిని మోహనరావు అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో వైద్యులు షకీలా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొండేటి బాబి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర శ్రీనివాసరావు, బొమ్మకంటి శ్యామలరావు, కుందేటి కస్తూరి, మానం పుంటేశ్వరరావు, మేరమెట్ల సురేంద్ర, పొట్లూరి అనురాధ, పొట్లూరి మహేంద్ర వర్మ లక్ష్మీ ప్రసన్న, మండలం ధర్మరాజు, చలసాని దామోదరరావు, కాటేపల్లి ప్రసాద్, గార్లపాటి నరసింహారావు, తోట శ్రీను, రంగు వాసు, సూరేపల్లి మల్లిబాబు, కొల్లి కృష్ణయ్య, దేవినేని శ్రీధర్, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో..

చింతలపూడి : ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చెప్పారు. చింతలపూడి మినీ బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన పల్స్ పోలియో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడులోని అంగన్వాడీ కార్యాలయంలో పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. మండలవ్యాప్తంగా పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ నెల 23 వరకు ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు డిప్యూటీ డిఎంహెచ్ఒ సురేష్ తెలిపారు. వేయించుకోని వారిని గుర్తించి మొబైల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారి ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, మణికంఠ, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, మంగ, ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక ఇందిరా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని నీలి సుమన్ కోరారు. కోరుకొల్లు సర్పంచి బట్టు లీలా కనక దుర్గ పోలియో చుక్కల కేంద్రాలను పరిశీలించి, పోలియో చుక్కలను చిన్నారులకు వేసి ప్రారంభించారు. మూలలంక, భాస్కరరావుపేటలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని తీర్చిదిద్దుదామని ఎంపిపి ఆర్.సత్యనారాయణ అన్నారు. వడాలి హైస్కూల్‌లో పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. టిడిపి నియోజకవర్గ కో-కన్వీనర్ వి.నరసింహారావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ముదినేపల్లి, శ్రీహరి పురం, పెనుమల్లి, గురజ, పెదపాలపర్రు, వడాలి, సింగరాయపాలెం, చేవూరు గ్రామాల్లో సర్పంచులు నిమ్మ గద్దె కైతమ్మ, పరసా విశ్వేశ్వరరావు, జంగం వెంకటేశ్వరరావు, మంచాల సరస్వతి, గంట రాకేష్‌కుమార్, మరీదు దుర్గశ్రీ, బోయిన విమల, వల్లభనేని లక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ముదినేపల్లి, దేవపూడి, గురజ పిహెచ్‌సిల పరిధిలో 97 శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు.

చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముసునూరు

బాలోత్సవం కార్యక్రమంలో చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మరీదు నాగరాజు తెలిపారు. ఆదివారం సెయింట్ థామస్ హైస్కూలులో జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో చైతన్య విద్యార్థులు అత్యధిక ప్రదర్శనలో భాగంగా కోలాటం, ఏకపాత్రాభినయం, వ్యాసరచన, ద్విపాత్రఅభినయం, పాటలు, డ్యాన్సులు, పౌరాణిక పాత్ర ఇలా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అకాడమిక్, నాన్ అకాడమిక్ వాటిలో విజయం సాధించి బహుమతులు సాధించారని చైతన్య స్కూల్ డైరెక్టర్ కొమిరినేని నాగబాబు, ప్రిన్సిపల్ సిహెచ్.కేశవరావు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

శీతాకాలంలో విపరీతమైన చలి కారణంగా పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి ఉపశమనంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. ఆదివారం ఆమె నివాసం వద్ద 50 మంది నిరుపేదలైన వృద్ధులకు, వితంతువులకు ఆమె చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఏటా శీతాకాలంలో దుప్పట్లు, చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నిడదవోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి సయ్యద్ రిహానా మాట్లాడుతూ, శీతాకాలంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు.

జిల్లాలో టిడిపి పటిష్టతకు కృషి

జిల్లా అధ్యక్షులుగా నియమితులైన ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ను, చింతలపూడి నియోజకవర్గానికి చెందిన జగ్గవరపు ముత్తారెడ్డిని ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అధ్యక్షుని పదవికి గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, బడేటి చంటిలు పోటీ పడినట్లు ప్రచారం సాగింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం సామాజిక తరగతుల వారీగా కేటాయింపుల్లో భాగంగా బడేటి చంటికి జిల్లా అధ్యక్షుని పదవి కేటాయించినట్లు తెలుస్తుంది. ఈ పదవిలో బడేటి చంటి రెండేళ్ల వరకు కొనసాగుతారు. ఈ సందర్భంగా బడేటి చంటి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తనకు పార్టీ జిల్లా పగ్గాలు అప్పజెప్పిన సిఎం చంద్రబాబుకు, నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. మిత్ర ధర్మాన్ని పాటిస్తూ కూటమిలోని జనసేన, బిజెపి నేతలతో సమన్వయం చేసుకుంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఎంఎల్ఎగా గడిచిన 18 నెలల కాలంలో తన పనితీరును గమనించిన పార్టీ అధినేత చంద్రబాబు తనపైతో నమ్మకంతో అధ్యక్ష పదవిని కట్టబెట్టారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. టిడిపి జిల్లా కార్యాలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, టిడిపి నాయకులు సత్య వరప్రసాద్, బెల్లంకొండ కిషోర్, డివిజన్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరులు కురిపించే అంతర పంట అగర్ వుడ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

సిరులు కురిపించే అంతరపంట పంట అగర్ వుడ్ అని ఆడం అగర్ వుడ్ సంస్థ సిఇఒ సంపంగి ప్రసాద్ తెలిపారు. మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న కొత్తపల్లి రామకృష్ణ పామాయిల్ తోటలో అగర్ వుడ్ ఇనాక్యులేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు మంచి ఆదాయం అందించాలనే లక్ష్యంతో తమ సంస్థ అహర్నిశలు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఆయిల్ పామ్, కొబ్బరి, మామిడి, జీడి మామిడి, కోకో, అరటి, జామ, బత్తాయి, సీతా ఫలం వంటి తోటల్లో అంతర పంటగా అగర్ వుడ్ సాగు చేయవచ్చని ఆయన తెలిపారు. ఆడం అగర్ వుడ్ సంస్థ దేశంలోనే మొదటి సారి అగ్రిమెంట్‌తో మొక్కలు అందిస్తుందని తెలిపారు. కేవలం పదేళ్లలోనే ఎకరానికి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీ నారాయణ, దారామతు భాస్కరరావు, కొవాసు బుడమన్న దొర, సవరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో, పలు డివిజన్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయప్రకాష్, పార్లమెంటరీ సమన్వయకర్త సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీనుల అభ్యున్నతికి జగన్ కృషి చేశారని వారు కొనియాడారు. నగరంలో పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రేమాలయంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, నేరుసు చిరంజీవి, మహిళా నాయకురాలు జుజ్జువరపు విజయనిర్మల, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మాజీ సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు మండలంలో పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెయ్యేరులో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కేక్ కట్ చేశారు. సింగరాయపాలెం, పెనుమల్లి, గురజ, ముదినేపల్లి, పెదపాలపర్రు, వణుదుర్రు తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు బోయిన రామరాజు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం : వైసిపి మండలాధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ పోలవరం పంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలవరం గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఫాతిమా మున్నిషా, సొబ్బన మోహన్, గొంతు వేణు, శ్యామ్, జాన్‌బాబు, దొంతల పోసిరావు, వెంకటరత్నం, కడితల రాజు, దత్తి రాంబాబు, టిబిఆర్ యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామంలో వైసిపి టౌన్ అధ్యక్షుడు నూకల రాము ఆధ్వర్యంలో జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి గంజిమాల రామారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గంటా శ్రీను, పార్టీ మండల ప్రెసిడెంట్ తుమ్మలపల్లి గంగరాజు, ఎస్‌సి సెల్ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి చంద్రం, జిల్లా నాయకులు, ఎస్‌సి సెల్ చిడిపి రవి, కార్మిక సంఘం అధ్యక్షుడు గొల్లగూడెం నాగేశ్వరరావు, బిసి సెల్ అధ్యక్షుడు మారిశెట్టి శ్రీను, జిల్లా నాయకులు చిటికెన నాగార్జున, కొయ్యలగూడెం మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు బుజ్జిబాబు, ఉపసర్పంచి సంకుకొండ, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు : మాజీ సిఎం జగన్ పేదల పక్షాన నిలబడి ఎన్నో సేవలందించారని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ముసునూరు ప్రధాన సెంటర్‌లో పార్టీ మండలాధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి రాజానాయన, బి.నరసింహారరావు, జలగం శేషగిరిరావు, కాటేపల్లి రమేష్, మానికల గంగాధర్, జి.రంగారావు, రేగుల గోపాల కృష్ణ, రేగుల నరసింహారావు, కంబాల దాసు, కొప్పుల ఏసుబాబు, సోగ్గాడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలో గ్రామ గ్రామాన జగన్ అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నారాయణపురం సంత బజారు వద్ద ఆ పార్టీ మండలాధ్యక్షుడు మరడ మంగారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు పైడి అరుణ్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు అరివెల్లి మహాలక్ష్మి, బండారు నాగరాజు, అడపా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చేబ్రోలు జగనన్న కాలనీలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, మనసాల నాగమణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముత్తా బుజ్జి, నాయకులు కర్ణం బుజ్జి, ఆకుల రాజా, తదితర అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో..

చింతలపూడి : బడుగు బలహీనుల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి మాజీ సిఎం జగన్ అని వైసిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. మండలంలో, నగరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందించి రక్తదాన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మాజీ సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను మండల వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపురం జాతీయ రహదారిపై ఉన్న వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను సర్పంచి సున్నం ఉషారాణి, సురేష్‌లు కేక్ కట్ చేశారు. అదేవిధంగా వంకావారిగూడెం పంచాయతీలో సర్పంచి కుంజా పార్వతి, రాముడులు కేక్ కట్ చేసి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జీలుగుమిల్లి కామయ్యపాలెం సెంటర్‌లో మండల కన్వీనర్ సంద ప్రసాద్, సర్పంచి చిర్రి జగదాంబ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, ఉప సర్పంచి రాఘవ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ఎస్‌టి సెల్ ప్రెసిడెంట్ కె.రాముడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఉదయం పది గంటలకు తుక్కులూరు జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులను ప్రారంభిస్తారు. 11.10 గంటలకు జంగంగూడెంలో జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జంగం గూడెం నుంచి బయలుదేరి 1.30 గంటలకు ఏలూరు చేరుకుని ప్రభుత్వ అతిథి గృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆశ్రమ ఆసుపత్రికి చేరుకుని జర్నలిస్టులకు హెల్త్ కార్డులు పంపిణీ చేస్తారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **పిన్నమనేని గంగాధరరావు** తండ్రి: **పిన్నమనేని రామకృష్ణారావు,** వయస్సు : 48సం॥లు, నివాసం:అల్లిపల్లి గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి: ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ డి.లో చేరిన చింతలపూడి మండలం, అల్లిపల్లి పంచాయితీలోని, అల్లిపల్లి గ్రామం తాలూకు జిరాయితీ మెరక, నా స్వార్జీతం బాపతు ఆస్తి అయియుండి లోగడ ది. 25-3-2022 న పిన్నమనేని గంగాధరరావు గారి వల్ల శ్రీ చింతలపూడి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో ద.నెం. 2398/2022 రు గా రిజిస్టరీ కాబడిన సెటిల్‌మెంట్ దస్తావేజు రీత్యా నాకు సర్వ హక్కులతో సంక్రమించబడి నేటి వరకు నా సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా సర్వే నెం. 92-2రు దాఖలా చ॥గ॥ 1200 లు చ॥గ॥ 1000 లు, **డాక్యుమెంట్ నెం. 3821/2025** స్థలములో గల రేకుల షెడ్డు గల స్థలమునకు హద్దులు : **తూర్పు:** దారి, **దక్షిణము:** ఆర్ అండ్ బి రోడ్డు, **పడమర:** మూలకాల లక్ష్మణ వగైరాల భూమి, **ఉత్తరము:** మిగిలిన నా తాలూకు స్థలం.

గండ్ర దీనదయాళ్, అడ్వకేట్ & నోటరీ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, సెల్ : 9848578963

పొలం డాక్యుమెంట్‌లు పడిపోయినవి

తూ.గో.జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంకు చెందిన కొరిపల్లి మీనాక్షి భర్త కొరిపల్లి సూర్య ప్రకాష్ రావు, డోర్ నెంబర్ 3-271/2, తెలియజేయునది ఏమనగా ప.గో.జిల్లా పోడూరు మండలం పండితవిల్లూరులో మాకు సంబంధించిన పొలం ఆచంట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ది.06-07-1989 తేదీన 984/1989 గా రిజిస్టర్ అయి ఉంది. ఈ పొలంకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్‌లు పోడూరులో బ్యాంక్ లోన్ కోసం తీసికొని రాగా ది.13-12-2025న పోడూరులో పడిపోయినవి. ఈ ఒరిజినల్ డాక్యుమెంట్‌లు ఎవరికైనా దొరికిన పై అడ్రస్‌లో అందజేయగలరు.

సెల్ 9392770213

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep by its Branch Manager it is stated that Smt.Gurajana Hema, W/o.Nagaraju, 32 Yrs, Business, R/o.Satyanarayana peta, Eluru town and Mandal, Eluru District, is creating mortgage against her property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 5 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SCHEDULE OF THE PROPERTY

Vacant house place of an extent of 145.2 Sq.Yards or 120.51 Sq. Meters in R.S.No.345 near Door No.1-62 Situated at Chekkapalli Village, Musunuru Mandal, Eluru District bounded by :

East : CC Road
South : House of Yagam Srinivasa Rao
West : House of Gurram Bujji
North: House of Banda Venugopala Rao

P.GANESH BABU
Kothagudem Advocate, Kothagudem.
Dt.21-12-2025 Cell: 98492 46278

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT: HYDERABAD.
O.S.No.2624 of 2022

Between:
Union Bank of India, [A Govt. of India undertaking] [formerly] Andhra Bank Credit card Division rep. by its, Senior Manager Koti, Sultan Bazar, Hyderabad.
...Plaintiff.
AND
Mr. Tolety Ravi Krishna
....Defendant.

Mr. Tolety Ravi Krishna,S/o Mr.T.Rama Murthy, Aged 62years,Occ; Govt. Teacher Appalarajugudem, T.Narsapur mandal, West Godavari District 534456
Or
Mr.Tolety Ravi Krishna, T.G.T. Science teacher, APR School, Appalarajugudem, T.Narsapuram mandal. West Godavari District-534456.

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No.2624 of 2022 on the file of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs.1,62,734.69 pertaining to your credit card no. 4373-7820-4742-5008. You are therefore directed to appear in person or through Advocate on 08.01.2026 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]

**M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587**